నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆత్మకూరు, ఏప్రిల్ 11 : ఆత్మకూరు సబ్ స్టేషన్ పరిధిలోని మల్కపేట, కొత్తగట్టు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7నుంచి 9గంటల వరకు మెయింటెనెన్స్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఐనవోలులో..

ఐనవోలు : ట్రీ కటింగ్, సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా కొండపర్తి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ముల్కలగూడెం, నర్సింహులగూడెంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఐనవోలు ఏఈ శివకుమార్ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైల్వే ఈసీసీఎస్ సభ్యుల సంక్షేమానికి కృషి

కాజీపేట, ఏప్రిల్ 11 : సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రైల్వే కార్మిక సభ్యుల సంక్షేమానికి కృషి చేద్దామని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (ఈసీసీఎస్) సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు చిలుకు స్వామి అన్నారు. కాజీపేట పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో గురువారం తనిఖీ చేశారు. కాజీపేట ఈసీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాలువ శ్రీనివాస్, డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

మూడు నెలల పసికందు మృతి • గూడెప్పాడ్ శివారులో ఘటన

ఆత్మకూరు, ఏప్రిల్ 11 : మండలం గూడెప్పాడ్ శివారులో జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో కారులో ఉన్న మూడు నెలల పసికందు మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. యాద్రాది భవనగిరి జిల్లా ఆలేరుకు చెందిన శ్రీకాంత్-ప్రవంతి దంపతులకు శ్రీనిక(3), మూడు నెలల పసికందు(బాబు) ఉన్నాడు. దంపతులు తమ పిల్లలతో కలిసి కారులో మంగపేట మల్లూరు దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో గూడెప్పాడ్ శివారులో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న మూడు నెలల బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్, ప్రవంతికి తీవ్ర గాయాలు కాగా, కూతురు శ్రీనికకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజారాం

వెంటనే బిల్లులు చెల్లించాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 11: వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేకుంటే ప్రజాపాలనను అడ్డుకుంటామని సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లుగా తాము ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రభుత్వం బిల్లుల మంజూరులో జాప్యం చేసినప్పటికీ అప్పులు తెచ్చి గ్రామాల అభివృద్ధి కోసం పెట్టుబడులు పెట్టామన్నారు. ఒక్కో సర్పంచ్ రూ. 50 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు పనులు చేయించాడన్నారు. మండలంలోని 29 జీపీలు కలుపుకొని సుమారు రూ. 8 కోట్ల పైచిలుకు నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరారు. లేకుంటే జీపీ కార్యాలయాలకు తాళాలు వేసి ప్రజాపాలనను అడ్డుకొని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాజీ సర్పంచ్‌లు సత్తా చాటుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు రత్నాకర్‌రావు, మోహన్‌రెడ్డి, ప్రకాశ్, పూల్‌సింగ్, చంద్రమౌళి, వెంకన్ననాయక్, అమరెందర్‌రెడ్డి, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

మక్కజొన్న పంటలు దగ్ధం

కొత్తూరులో కాలిపోయిన మక్కజొన్న పంట

ఖానాపురం, ఏప్రిల్ 11: ప్రమాదవశాత్తు రెండు వేర్వేరు గ్రామాల్లో మక్కజొన్న పంటలు దగ్ధమైన ఘటన ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లో గురువారం జరిగింది. రైతుల కథనం ప్రకారం.. ఖానాపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జాటోత్ రాజేంద్రప్రసాద్ తన 1.20 ఎకరాల వ్యవసాయ భూమిలో, జాటోత్ భద్రు 20 గుంటల్లో మక్కజొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఇద్దరు రైతుల పంటలు పూర్తిగా కాలిపోయాయి. రూ. లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన ఓ రైతు మక్కజొన్న కొయ్యలకు నిప్పు పెట్టాడు. మంటలు వ్యాపించి పక్కనే ఉన్న రైతులు భూక్యా ఈర్య, శంకర్, ఆరోగ్యంకు చెందిన మక్కజొన్న చేలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 3 లక్షల పంట నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556
9182777557 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 MAHABUBABAD
9182777554 JANGAON
9182777565

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

కాజీపేట : దర్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న పీఠాధిపతి ఖుస్రూ పాషా

పోచమ్మమైదాన్: ఎల్‌బీ నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- వేడుకలు జరుపుకున్న ముస్లింలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఈద్గా ఘనీ అబ్దుల్ అజీజ్ కమిటీ అధ్యక్షుడు ఎండీ సాదిక్, ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్లా అన్నారు. వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బీనగర్ ఈద్గాలో వేలాది ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. నల్లబెల్లి మండలంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలో మత గురువు ఇమామ్ హబీబుల్ రహమన్ రంజాన్ ప్రత్యేకతను తెలిపారు. ఖానాపురం మండలం బుధరావుపేటలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా, తురుకల సోమారం, చింతనెక్కొండ, వడ్లకొండ, పర్వతగిరి, కల్లెడ, కొంకపాకలో ప్రార్థనలు చేశారు. వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వర్ధన్నపేట పట్టణంలోని ముస్లింల ఇండ్లకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఐనవోలు, రాయపర్తి మండలంలో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను నిర్వహించుకున్నారు. మండల కేంద్రం శివారు కొండూరు రోడ్డులోని మసీద్-ఏ-విద్యానగర్, మసీదు గడ్డలో మహ్మద్ హుస్సేన్ నేతృత్వంలో ప్రార్థనలు చేశారు. కాజీపేట, బోడగుట్ట, దర్గా, ప్రశాంత్‌నగర్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కాజీపేటలో దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా సయ్యద్ షా అజ్జల్ బియాబాని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేశారు. దామెర మండలంలోని ఊరుగొండ ఈద్గాలో వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, కోగిల్వాయి ఈద్గాలో మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, ఓగులాపురం సైలనాబీ బాబా దర్గాలో సైలానీబాబా, నడికూడ మండలంలోని ముస్తాల్యపల్లి, గీసుగొండ మండలంతో పాటు గ్రేటర్ వరంగల్ 15, 16వ డివిజన్‌లో, సంగెం మండలంలోని స్టేషన్ చింతలపల్లి, గవిచర్ల గ్రామాల్లోని ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. వేలేరులోని షేక్ ఫరీద్ షకర్ గంజ్ బాబా దర్గా, ధర్మసాగర్‌లో ముస్లింలు ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కమలాపూర్ : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మత సామరస్యానికి పుట్టినిల్లు ఓరుగల్లు..

హనుమకొండ చౌరస్తా : మత సామరస్యానికి పుట్టినిల్లు ఓరుగల్లు అని బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ నయీముద్దీన్ అన్నారు. పెద్దమ్మగడ్డ ఈద్గా హుస్సేనీ ఆలంలో ఈద్-ఉల్-ఫితర్ మౌలానా మోహినుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈద్గా కమిటీ సభ్యులు సలీం, ఖలీల్, మొయిన్, తౌసిఫ్ పాల్గొన్నారు.



ఫోర్ట్ రోడ్డు ఈద్గా వద్ద ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మంత్రి సురేఖ

అల్లాను స్మరించుకోవడం అదృష్టం

రంజాన్ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి • మంత్రి కొండా సురేఖ

వరంగల్, ఏప్రిల్ 11 : రంజాన్ పండుగ వేళ అల్లాను స్మరించుకోవడం తన అదృష్టమని మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నగరంలోని జెమిని టాకీస్ ఎదురుగా ఉన్న ఈద్గాలో ఆమె ప్రార్థనలు చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉంటా..

కరీమాబాద్ : ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటానని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కరీమాబాద్ ఫోర్టురోడ్డులోని ఈద్గాలో ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా, ప్రార్థనల్లో వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు అలయ్ బలయ్ తీసుకున్నారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, హసన్ అలీబేగ్, గోరె భాయ్, మాషుఖ్, అంజత్, సయ్యద్ మహబూబ్, ఖాదర్‌పాషా, గౌస్, యాకూబ్, దస్తగిరి, యూనిస్ పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, కార్పొరేటర్ పోశాల పద్మ పాల్గొన్నారు.

బొక్కలగడ్డ ఈద్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు..

హనుమకొండ చౌరస్తా : బొక్కలగడ్డ ఈద్గాలో ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వేయిస్తంభాల దేవాలయంలోని యాగశాలలో హోమం చేస్తున్న భక్తులు

వేయిస్తంభాల దేవాలయంలో జిహ్వ హోమం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 11 : చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడోరోజు యాగశాలలో జిహ్వ హోమం నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. శుక్రవారం లక్ష పుష్పార్చన చేయనున్నట్లు తెలిపారు.

అమ్మవార్లకు కనకాంబరం, చామంతులతో పుష్పార్చన

కనకాంబరాలతో భద్రకాళికి పుష్పార్చన

వరంగల్, ఏప్రిల్ 11 : భద్రకాళీ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం అమ్మవారికి పుష్పార్చన చేశారు.

చామంతులతో పద్మాక్షి అమ్మవారికి..

హనుమకొండ : హనుమకొండ పద్మాక్షికాలనీలో హనమద్గిరి పద్మాక్షిదేవికి ప్రత్యేక అలంకరణ చేసినట్లు దేవాలయ అర్చకులు శంకర్ శర్మ,షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. గురువారం అమ్మవారికి చామంతులతో అర్చన చేశారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే • పలు భవనాల పరిశీలన

వరంగల్, ఏప్రిల్ 11 : టీఎస్ బీపాస్ నిబంధనలు పాటిస్తేనే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తామని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. గురువారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ కోసం పరిమళ కాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట, నక్కలగుట్ట, శాయంపేటలో భవనాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరు టీఎస్ బీపాస్ నిబంధనలు పాటించాలన్నారు. సిటీ ప్లానర్ వెంకన్న ఉన్నారు.

పత్తిపాకలో రక్తదాన శిబిరం

శాయంపేట, ఏప్రిల్ 11 : మండలంలోని పత్తిపాక గ్రామంలో అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి నాలికె ప్రతాప్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల విలీనం లేదని తీర్మానం



సమావేశం నిర్వహిస్తున్న పాలక మండలి సభ్యులు

మడికొండ, ఏప్రిల్ 11: మడికొండ మెట్టుగుట్టపై ఉన్న శివాలయం, రామాలయాన్ని విలీనం చేయొద్దని పాలక మండలి తీర్మానం చేసింది. నిధుల బదిలీ, ఆలయాల విలీనం, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై గురువారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిధుల బదిలీ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, దేవస్థాన నిధులు బ్యాంకు ఖాతాలోనే ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు చెప్పారు. ఆలయాల విలీనంపై భక్తులు, గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో విలీనాన్ని రద్దు చేస్తున్నట్లు తీర్మానం చేశామన్నారు. శివాలయం, రామాలయం అర్చక ఉద్యోగుల భద్రతపై స్పష్టత వచ్చే వరకూ విలీనం చేయబోమన్నారు. కాగా, రామాలయం అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు ఆలయాలను విలీనం చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని వెళ్లిపోవడంతో తీర్మానం చేసినట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటుకు ఓటు అమ్ముకుంటే శవంతో సమానం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న 'జై భారత్' సభ్యులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 11 : ఎన్నికల్లో రాజకీయ నాయకులు ఇచ్చే డబ్బుకు ఆశపడితే ఐదేళ్ల పాటు మోసపోవడం ఖాయమని, డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానమని జై భారత్ జస్ట్ ఓట్ తెలంగాణ క్యాంపెయిన్ కమిటీ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా నాయకులు గగన్, సాంబశివరావు పాల్గొన్నారు.

14న కేయూలో అంబేద్కర్ జయంతి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 11 : కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 14న అంబేద్కర్ 134వ జయంతి నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ సెల్ సంచాలకులు రాజమణి తెలిపారు. వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొంటారన్నారు.

'కోడ్ నేపథ్యంలో కాషాయ కండువాలు వేసుకోవద్దు'

కరీమాబాద్, ఏప్రిల్ 11: ఎన్నికల కోడ్ నేపథ్యంలో కాషాయ కండువాలు వేసుకోవద్దని మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య సూచించారు. ఉర్సులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి గురువారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడకు పలు పార్టీలు, సంఘాల నాయకులు వచ్చారు. అందులో ఇద్దరు వ్యక్తులు కాషాయ కండువాలను మెడలో వేసుకున్నారు. విధుల్లో ఉన్న సీఐ మల్లయ్య కండువాలు తీయాలని వారికి సూచించారు. తాము పార్టీ నేతలం కాదని, హిందువులమని, అందుకే కండువాలు వేసుకున్నామన్నారు. అయితే, ఎన్నికల కోడ్ నేపథ్యంలో కాషాయ కండువాలు వేసుకోవద్దని కోరారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. ఈ ప్రాంతంలో దర్గా ఉండడంతోపాటు రంజాన్ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఎలాంటి సమస్య తలెత్తకుండా వారిని కండువాలు తీయాలని కోరినట్లు తెలిపారు.



షోయబ్‌బాబాతో మాట్లాడుతున్న నన్నపునేని నరేందర్

పీఠాధిపతిని కలిసిన నన్నపునేని

కరీమాబాద్, ఏప్రిల్ 11: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉర్సులోని కమాల్‌పాషా ఘడీ పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ ఎహియాపాషా ఖాద్రీ (షోయబ్‌బాబా)ని తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అలయ్ బలయ్ తీసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసూద్, ముస్లిం వెల్ఫేర్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సాదిక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్‌కుమార్, పొగాకు సందీప్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 11: రంజాన్ పండుగ సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. మట్టెవాడలోని ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య జాతీయ నాయకుడు గట్టు మహేశ్‌బాబు, గౌరవ అతిథిగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు పాల్గొని అందజేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ సప్తాహం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 11: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి జరిగిన శ్రీమద్రామాయణ సప్తాహం కార్యక్రమంలో ప్రముఖ పండితులు సముద్రాల శఠకోపాచార్యులు అయోధ్యకాండలోని విశేషాలను వివరించారు. శ్రీరాముని గుణగణాలు, తండ్రిమాట జవదాటని రాముని వ్యక్తిత్వం గురించి పేర్కొన్నారు.

28న రఘునాథాచార్యస్వామి 99వ తిరునక్షత్రోత్సవం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 11: ఉభయ వేదాంతమహోధరి, పరమపదవాసులు రఘునాథాచార్యస్వామి 99వ తిరునక్షత్రోత్సవాన్ని ఈ నెల 28న హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 11: వరంగల్ కేఎంసీ వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. హనుమకొండ టైలర్ స్ట్రీట్‌కు చెందిన దీపక్ ఈ నెల 9న బైక్‌పై వెళ్తున్న సమయంలో పెట్రోల్ అయిపోగా రోడ్డు పక్కన పార్కు చేసి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. గురువారం బాధితుడు ఫిర్యాదు చేసినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

బార్ అసోసియేషన్ హాల్‌కు ఫూలే నామకరణం

వరంగల్ లీగల్, ఏప్రిల్ 11 : వరంగల్ బార్ అసోసియేషన్ హాల్‌కు మహాత్మా జ్యోతిరావు ఫూలే పేరు పెట్టి న్యాయవాదులు నివాళి అర్పించారు. గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ.. గొప్ప వ్యక్తిని గౌరవించుకోవడం విధిగా భావించి ఫూలే పేరును బార్ అసోసియేషన్ హాల్‌కు పెట్టామన్నారు. హనుమకొండ బార్ అధ్యక్ష, కార్యదర్శులు మాతంగి రమేశ్‌బాబు, లాడే రమేశ్, బార్ కౌన్సిల్ సభ్యులు జనార్దన్, జయాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు

నయీంనగర్, ఏప్రిల్ 11 : రానున్న ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు బీజేపీలో ఉన్న నాయకులందరూ భారీ కుంభకోణాలు చేసిన వారే అని గుర్తు చేశారు. ప్రజలను మతోన్మాదంతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. భారతీను హిందూ దేశంగా మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. విపక్షాల నాయకులను ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించి లొంగదీసుకుని బీజేపీలో చేర్చుకుని క్లీన్‌చిట్ ఇస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని, దళిత వ్యతిరేక పార్టీ అయిన బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం సరి కాదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు గత పదేళ్లలో నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని, విభజన హామీలైన బయ్యారం ఉక్కు, విద్యుత్‌ను కూడా ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో చుక్కయ్య, శివాజీ, బాలరాజు, చక్రపాణి, రవి, భిక్షపతి, కుమారస్వామి, శ్రీనివాస్, రాజేశ్, దయాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

మహాత్మా జ్యోతిరావు ఫూలే గొప్ప అభ్యుదయవాది

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, ఏప్రిల్ 11 : పూలే గొప్ప అభ్యుదయ వాది, సామాజిక విప్లవ పితామహుడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్ అధ్యక్షత నిర్వహించిన వేడుకలకు దాస్యం హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పూలే స్ఫూర్తితో బహుజన వర్గాల అభ్యున్నతికి పోరాడుదామని పిలుపునిచ్చారు. సామాజిక దురాచారాలపై పోరాడిన విప్లవయోధుడు పూలే అన్నారు. పూలే జయంతి, వర్ధంతిని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అధికారికంగా నిర్వహించారని, ఆయన పేరిట వందలాది గురుకుల పాఠశాలలను ప్రారంభించారని వివరించారు. కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, కుసుమ లక్ష్మీనారాయణ, మేకల బాబురావు, వేణు, కే శ్రవణ్, డివిజన్ అధ్యక్షులు సదాంత్, మనోజ్, చందర్, చిన్న పాల్గొన్నారు.

గొప్పదార్శనికుడు మహాత్మాజ్యోతిరావు పూలే : వీసీ

హ